ఆదర్శనగర్‌లో సమస్యల తిష్ట

- తవ్వి వదిలేసిన సీసీ రోడ్లు
- వీధుల్లో వెలగని విద్యుత్ లైట్లు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని జోన్–3 అధికారులు

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ 17వ వార్డు ఆదర్శనగర్‌లో పలు సమస్యలు తిష్ట వేశాయి. జోన్–3 పరిధిలో అధిక జనసాంద్రత కలిగిన ప్రాంతాల్లో ఆదర్శనగర్ ఒకటి. గత ఐదేళ్లుగా స్థానికుల కోసం అనేక సౌకర్యాలు ఇక్కడ అందుబాటులోకి తెచ్చారు. డ్రైనేజీల ఆధునికీకరణ, వీధిలైట్ల ఏర్పాటు, మెరుగైన పారిశుధ్యం కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. దీంతో కొన్నేళ్లుగా ఈ కాలనీలో ఎటువంటి సమస్యలకు తావులేదు. ప్రస్తుతం ఆదర్శనగర్‌లో అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. గోతుల రహదారులు, వెలగని వీధి దీపాల సమస్య కాలనీ వాసులను నేడు వెంటాడుతోంది.

రాకపోకలకు నరకయాతన

ప్రస్తుత పాలకులు, జీవీఎంసీ అధికారుల నిర్లక్ష్య ధోరణి కారణంగా ఆదర్శనగర్ వాసులు సమస్యలతో సతమతమవుతున్నారు. వీధుల్లో విద్యుత్ లైట్లు వెలగక రాత్రి పూట ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో రాత్రిపూట రాకపోకలకు అవస్థలు పడుతున్నట్లు చెబుతున్నారు. రెండు నెలల కిందట వాటర్ పైప్‌లైన్ల కోసం కాలనీ ప్రధాన రహదారితోపాటు పలు వీధుల్లోని సీసీ రోడ్లను తవ్వేశారు. పైప్‌లైన్స్ పునరుద్ధరణ ప్రక్రియ నత్తనడకన సాగడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ పనులు పూర్తయినప్పటికీ తవ్విన రోడ్లను నేటికీ పునరుద్ధరించ లేదు. సీసీ రోడ్లు తవ్విన చోట పనులు పూర్తయిన అనంతరం మళ్లీ కాంక్రీట్‌తో పూడ్చి రోడ్లను పునరుద్ధరించాలనే నిబంధన ఉంది. వాటర్ పైప్‌లైన్ పనితీరు పర్యవేక్షణ పేరుతో తవ్వి రెండు నెలల పైనే అవుతున్నా జీవీఎంసీ వాటర్ సప్లై విభాగం అధికారులు సీసీ రోడ్డు గుంతలను నేటికీ పూడ్చేలేదు. దీంతో గోతుల రహదారిలోనే స్థానికులు రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రి పూట వీధిలైట్లు సైతం వెలగకపోవడంతో రాకపోకలకు నరకయాతన పడుతున్నామని ఆదర్శనగర్ వాసులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.



అంధకారంలో ఓ వీధి







17వ వార్డు ఆదర్శనగర్‌లో తవ్వి వదిలేసిన రహదారులు, ఇళ్ల ముందు గోతులు

క్లుప్తంగా

ఏయూ చిరుద్యోగికి సాయం



లక్ష్మికి ఆర్థిక సాయం అందిస్తున్న మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యులు

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చిరుద్యోగిగా పనిచేస్తున్న పి.లక్ష్మి అనారోగ్యంతో బాధ పడుతున్న విషయం మానవతా స్వచ్ఛంద సంస్థ దృష్టికి వచ్చింది. వెంటనే స్పందించిన సంస్థ సభ్యులు రూ.5 వేల ఆర్థిక సాయాన్ని గురువారం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు చేతుల మీదుగా ఆమెకు అందజేశారు. కార్యక్రమంలో మానవతా సంస్థ చైర్మన్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఉపాధ్యక్షులు కె.సీతామాణిక్యం, అధ్యక్షుడు డాక్టర్ టి.శారోన్ రాజు, ఉపాధ్యక్షుడు ఆచార్య పి.జానకీరామ్, కార్యదర్శి ఆచార్య పి.త్రినాథ రావు, కోశాధికారి డాక్టర్ వి.వి.ఎస్.రామకృష్ణ, కన్వీనర్ డి.పల్లవి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు క్రైస్తవ భక్తిపాటల పోటీలు

బీచ్‌రోడ్డు: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని క్రైస్తవ భక్తిపాటల పోటీలు నిర్వహించనున్నట్లు హోలీవే మినిస్ట్రీస్ సమన్వయకర్త డాక్టర్ ఇ.సత్యానందకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎంవీపీ పోలీస్ స్టేషన్ ఎదురుగా గల హోలీ టవర్స్ భవనంలో పోటీలు జరుగుతాయని చెప్పారు. 5 నుంచి 15 ఏళ్ల లోపు వయసు గల పిల్లలు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. విజేతలకు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల బాలలు 98666 81122 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

తరగతుల్లో తనిఖీలు



తరగతుల నిర్వహణను పరిశీలిస్తున్న రెక్టార్ కిషోర్‌బాబు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తరగతుల నిర్వహణ తీరును రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు నేతృత్వంలోని కమిటీ సభ్యులు గురువారం స్వయంగా పరిశీలించారు. మహిళా ఇంజినీరింగ్ కళాశాల, ఐఏఎస్‌ఈ విభాగాలను సందర్శించారు. విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్న విధానాన్ని గమనించారు. సిబ్బంది హాజరు పట్టికలు, సమయపాలన తదితర అంశాలను తనిఖీ చేశారు.

15 నుంచి క్రీడా పోటీలు

ఏయూక్యాంపస్: విశాఖ జిల్లా యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీచ్ రోడ్డు గోకుల్ పార్క్ ఆవరణలో ఈ నెల 15న జరగనున్న శ్రీరాధాకృష్ణ పాలు పెరుగు యదుమేళాలో భాగంగా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం నుంచి జరగనున్న క్రికెట్ పోటీలకు సంబంధించిన డ్రాను గురువారం గోకుల్ పార్క్ ఆవరణలో అక్కరమాని వెంకటరావు, ఇతర యాదవ నాయకులతో కలిసి తీశారు. ఈ పోటీల్లో 50 టీమ్‌లు పాల్గొంటున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఒమ్మిడి ఎల్లాజీరావు, నక్క కనగరాజు, గుమ్మిడి నర్సింగరావు, వేణు గోపాల్, పల్లా మహేష్, డాక్టర్ గుంటుబోయిన రవి కుమార్, భాగ్యానంద్, సర్వసిద్ధి అచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మద్దిలపాలెం: ఈపీడీసీఎల్ జోన్–1 పరిధిలోని జేఆర్ నగర్, సీఎంఆర్ ఫీడర్ల ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఇసుకతోట లాన్సమ్, సీఎంఆర్ ఫంక్షన్ హాల్, ఈడెన్ గార్డెన్స్ అపార్ట్‌మెంట్, జేఆర్ నగర్, పాత వెంకోజీపాలెం ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాకు ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

సీవీ రామన్‌కు ఘన నివాళి



సర్ సీవీ రామన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఏయూ ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్లు

విశాఖ సిటీ: నోబెల్ బహుమతి గ్రహీత సర్ సీవీ రామన్ 136వ జయంతి వేడుకలు గురువారం ఏయూ భౌతిక శాస్త్రం విభాగంలో నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఏయూలో ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ ఏర్పాటులోను, దాన్ని పరిశోధనలకు జాతీయ కేంద్రంగా మార్చడంలో సీవీ రామన్ పాత్రను అధ్యాపకులు గుర్తు చేశారు. ఏయూలో ఆయన కొన్ని ముఖ్యమైన పరిశోధనలు చేశారని తెలిపారు. ఆరోగ్య, పర్యావరణ పరిరక్షణ, సాంకేతికత, శాస్త్రీయ పరిశోధనలపై దృష్టి సారించారన్నారు. కార్యక్రమంలో ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాసరావు, మాజీ రెక్టార్ ప్రొఫెసర్ కె.సమత, పీజీబీవోఎస్ చైర్మన్ డి.బి.వెంకటాద్రి, ఇతర అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌లో 'స్పోర్ట్స్ ఎరీనా' సత్తా



స్విమ్మింగ్‌లో విజేతలుగా నిలిచిన ఎరీనా క్రీడాకారులు

ఎంవీపీకాలనీ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా–2024 ఇంటర్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్, బ్యాడ్మింటన్ పోటీల్లో ఎంవీపీకాలనీలోని ఎస్–3 స్పోర్ట్స్ ఎరీనా క్రీడాకారులు సత్తాచాటారు. నరసరావుపేట వేదికగా జరుగుతున్న ఈ పోటీల్లో స్పోర్ట్స్ ఎరీనాకు చెందిన పలువురు క్రీడకారులు పాల్గొని పతకాలు కైవసం చేసుకున్నట్లు నిర్వాహకుడు సహాని గురువారం తెలిపారు. స్విమ్మింగ్‌లో ఎస్.జిశిథీస్ నాయుడు 100 మీటర్లు, 200 మీటర్ల ఫ్రీస్టైల్‌తో పాటు 200 మీటర్ల బటర్‌ఫ్లై కేటగిరీలో బంగారు పతకాలు సాధించాడు. అలాగే ఎ.హిమశ్రీ 50 మీటర్లు, 200 మీటర్ల ఫ్రీస్టైల్‌లో బంగారు పతకాలు, 400 మీటర్ల ఫ్రీ స్టైల్‌లో రజతం సాధించింది. జి.సాయి సిద్ధార్థ్ 50 మీటర్ల ఫ్రీస్టైల్‌లో రజత పతకం కైవసం చేసుకున్నాడు. అలాగే మధ్యప్రదేశ్‌లో జరగనున్న అండర్–19 నేషనల్ స్కూల్ గేమ్స్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఎస్–3 స్పోర్ట్స్ ఎరీనా క్రీడాకారుడు పార్థీవ్ రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు సహాని తెలిపారు. దీంతో పాటు పలువురు క్రీడాకారులు రాజ్‌కోట్‌లో జరిగే నేషనల్ స్కూల్ గేమ్స్‌కు ఎంపికైనట్లు వెల్లడించారు.

కొండవాలులో యూజీడీ సమస్య పరిశీలన



యూజీడీ సమస్యను తెలుసుకుంటున్న అధికారులు, కార్పొరేటర్

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డులో భూగర్భ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి గురువారం యూజీడీ అధికారుల బృందం పర్యటించింది. కొండవాలు ప్రాంతంలో యూజీడీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికుల అభ్యర్థన మేరకు అధికారులు సందర్శించారు. సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంలో యూజీడీ పైప్‌లైన్, మ్యాన్‌హోల్ లీకేజీలను జీవీఎంసీ వాటర్ సప్లై అండ్ యూజీడీ మెయింటెనెన్స్ ఎస్‌ఈ కె.వి.ఎన్.రవి, ఏఈ షేక్ రహీం, వర్క్ ఇన్‌స్పెక్టర్ సాయి, కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్యతో కలిసి పరిశీలించారు. ఇప్పటి వరకు వార్డులో రూ.1.5 కోట్లతో యూజీడీ పనులు చేసినట్లు అధికారులు తెలిపారు. కొండ ప్రాంతం నుంచి వెళ్లి పాత వెంకోజీపాలెం జంక్షన్‌లో మంచినీటి ప్రధాన పైప్‌లైన్ ఉండటం వల్ల యూజీడీ పైప్‌లైన్‌ను ఎల్ షేప్ తిప్పామని, ఆ ప్రాంతంలో మరో ప్రత్యామ్నాయ మార్గాన్ని ఏర్పాటు చేసి యూజీడీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రయత్నిస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. త్వరలోనే దీనిపై పునరాలోచించి శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.

క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావు సూచించారు. గురువారం రేసవానిపాలెంలో ఉన్న డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి సత్యం జంక్షన్ కూడలి మీదుగా తిరిగి డీఎంహెచ్‌వో కార్యాలయం వరకు నర్సింగ్ స్టూడెంట్లు, సిబ్బందితో కలిసి కాన్సర్ అవగాహన ర్యాలీని డీఎంహెచ్‌వో జెండా ఊపి ప్రారంభించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తు పరీక్ష – క్యాన్సర్ నుంచి రక్ష– క్యాన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తోనే సాధ్యమని, అలాగే 18 సంవత్సరాలు పైబడిన వారందరూ తప్పకుండా స్క్రీనింగ్ చేయించుకోవాలన్నారు. మీ ఇంటి వద్దనే ఆరోగ్య సిబ్బంది వచ్చి స్క్రీనింగ్స్ చేస్తారని అన్నారు . ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలి అని పేర్కొన్నారు. ర్యాలీలో జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్లు, వైద్యులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హిడెన్ స్ప్రౌట్స్ స్కూల్‌లో వైద్య శిబిరం



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న సివిల్ జడ్జి వెంకట శేషమ్మ

ఎంవీపీకాలనీ: లాసన్స్ బే కాలనీలోని హిడెన్ స్ప్రౌట్స్ మానసిక దివ్యాంగుల పాఠశాలలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పాఠశాల విద్యార్థుల మానసిక, ఆరోగ్య పరిస్థితులను నిపుణులైన వైద్యులు పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు కావాల్సిన ఔషధాలను అందజేసి, ఆరోగ్యం మెరుగుపరచుకునే, మానసిక సమస్యలను అధిగమించేందుకు అవసరమైన సూచనలిచ్చారు. జిల్లా సివిల్ జడ్జి, లీగల్ సర్వీసెస్ అథారటీ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కేజీహెచ్, విశాఖ మెంటల్ కేర్ ఆస్పత్రుల వైద్య నిపుణులు, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, స్కూల్ నిర్వాహకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్లాంటేషన్



మొక్కలు నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి దంపతులు

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెంలోని గౌరీ జ్ఞాన లింగేశ్వరాలయ ప్రాంగణంలో గురువారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు దంపతులు తులసి, మారేడి, పత్రి వంటి మొక్కలు నాటారు. గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వాముల నిత్యాన్నదానంలో భాగంగా ఎమ్మెల్యే దంపతులు తమ సహాయం అందించారు. అనంతరం స్వాములకు మధ్యాహ్న భోజనం వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యప్రకాష్ శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, బాల భాస్కర శాస్త్రి, గ్రామ సేవా సంఘం కార్యవర్గ సభ్యులు, టీడీపీ నాయకులు కాళ్ల శంకర్, బోర ధన రెడ్డి, బుగత సత్యనారాయణ, మళ్ల రవికుమార్, ఆడారి కామేశ్వరరావు, మద్దాల వీర వెంకట అప్పారావు, బొట్టా రమణ, ఒమ్మి గోవింద్, సంఘం సభ్యుడు కాళ్ల పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రీ రిపబ్లిక్ డే శిక్షణకు ఏయూ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ సిటీ: మహారాష్ట్రలో జరగనున్న ముందస్తు గణతంత్ర దినోత్సవ శిక్షణా కార్యక్రమానికి ఆంధ్ర విశ్వవిద్యాలయం తరఫున ఎంపికైన విద్యార్థులను ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు గురువారం అభినందించారు. ఈ నెల 12 నుంచి 21వ తేదీ వరకు మహారాష్ట్రలోని కేసీబీ నార్త్ మహారాష్ట్ర యూనివర్సిటీలో వెస్ట్ జోన్ ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంపు జరగనుంది. ఏయూ నుంచి ఆరుగురు విద్యార్థులు ఇందులో పాల్గొననున్నారు. ఇటువంటి అరుదైన అవకాశం సాధించిన విద్యార్థులను వీసీ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరినాథ్ తదితరుఉ పాల్గొన్నారు.

ఐఐఏఎంలో ఇంక్యుబేషన్ సెంటర్ సేవలు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని ఇంటిగ్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్(ఐఐఏఎం) ఆధ్వర్యంలో ఇంక్యుబేషన్ సెంటర్ సేవలు అందుబాటులోకి తెచ్చినట్లు సంస్థ సంయుక్త సంచాలకుడు ఆచార్య పి.ఎం.బాలాజీ తెలిపారు. యువతలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు, ఆసక్తి గల వారిని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఈ సెంటర్ సేవలు ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు. ఏయూ ఆ–హబ్ సీఈవో రవి ఈశ్వరపు, శుభం సేఫ్టీ సొల్యూషన్స్ సీఈవో ప్రతీక్ సింఘీలు ఈ సెంటర్‌ను ప్రారంభించినట్లు ఆయన చెప్పారు.

ముఖ ఆధారిత హాజరుపై పునరాలోచించాలి

మద్దిలపాలెం: వైద్య, ఆరోగ్య శాఖలో ముఖ ఆధారిత హాజరును జీతాలతో అనుసంధానం చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని తెలుగు నాడు వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నాడ శేషుబాబు ఒక ప్రకటనలో సూచించారు. 24 గంటలూ రోగులకు అందుబాటులో ఉంటున్న ఉద్యోగులకు ఈ విధానం పెట్టడం సమంజసం కాదన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలు పణంగా పెట్టి క్షేత్రస్థాయిలో రోగులను గుర్తించడంలో వైద్య శాఖ ఉద్యోగులు చేసిన కృషిని గుర్తు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో డెంగ్యూ, మలేరియా, డయేరియా వ్యాప్తిని అరికట్టేందుకు సమయంతో పనిలేకుండా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది ఇబ్బందులను గుర్తించి ముఖ ఆధారిత హాజరు విధానం నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆయన కోరారు.

వీఎంఆర్‌డీఏ పనులపై కమిషనర్ సమీక్ష

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ చేపట్టిన ప్రాజెక్టులు, నిర్వహణ పనుల ప్రగతిపై వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులతో గురువారం సమీక్షించారు. హెల్త్ ఎరీనా, సెంట్రల్ పార్క్, సీ హారియర్, చిల్డ్రన్స్ ఎరీనా నిర్వహణ పనులపై ఆరా తీశారు. సాధ్యమైనంత వేగంగా మరమ్మతులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. చీమలాపల్లి, ఎండాడ కన్వెన్షన్ సెంటర్ల పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ప్రధాన ఇంజినీర్ భవానీశంకర్, కార్యనిర్వాహక ఇంజినీర్లు ఎస్.వి.ఎస్.ఎన్.రాజు, రామరాజు, సుధీర్, ఉపకార్యనిర్వాహక ఇంజినీర్లు, ఏఈలు పాల్గొన్నారు.

నిండుగా జూ కొలను



కొలనులో విహరిస్తున్న నల్ల హంసలు



జూ కొలనులో నిండుగా ఉన్న నీరు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులోని కొలను నీటితో కళకళలాడుతోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొండల నుంచి వచ్చిన వరద నీరు కొలనులో చేరడంతో నిండుకుండలా మారింది. శాంతి సరోవర్ పేరుతో పిలిచే ఈ కొలను జూ మధ్యలో ఉంది. ఇది ఈ ఏడాది వేసవిలో ఎండలకు ఎండిపోయి బీటలు బారింది. జూ లోపల కొండలపై బాహ్య ప్రపంచంలో స్వేచ్ఛగా తిరిగే జింకలు, అడవి పందులు, కనుజులు ఈ కొలనులో నీరు తాగి దాహం తీర్చుకునేవి. ఇది ఎండిపోవడంతో వాటికి దాహం తీర్చుకొనే సమస్య ఏర్పడింది. ఇటీవల కురిసిన వర్షాలకు కొండల నుంచి వచ్చిన స్వచ్ఛమైన నీరు ఈ కొలనులో చేరింది. దీంతో కొత్త నీటితో శాంతి సరోవర్ తొణికిసలాడుతోంది. దీంతో కొంతకాలం వరకు బాహ్య ప్రపంచంలో తిరిగే వన్యప్రాణులకు నీటి సమస్య తీరినట్లయింది. నీటితో నిండిన ఈ కొలను చుట్టూ చేపలు కోసం వివిధ రకాల పక్షులు తిరుగుతూ జూ సందర్శకులను అలరిస్తున్నాయి.

జూలో అలరిస్తున్న నల్ల హంసలు

ఇందిరాగాంధీ జూ పార్కులో సందర్శకులను నల్ల హంసలు అలరిస్తున్నాయి. జూ ప్రధాన ద్వారం ద్వారా లోపలకు ప్రవేశించగానే ఎదురుగా వీటి కొలను కనిపిస్తుంది. దీనిలో 6 నల్ల హంసలున్నాయి. ఇవి నీటి కొలనులో హుషారుగా విహరిస్తుంటాయి. నీటిలో మునగడం, రెక్కలు ఆడిస్తూ ఈత కొట్టడం, పొడవైన వాటి మెడతో విన్యాసాలు చేస్తూ సందర్శకుల ను కనువిందు చేస్తున్నాయి. రెండు హంసలు నీటిలో మునిగి తేలుతూ వాటి మెడలు వివిధ ఆకారాలతో సందర్శకులను ఆకట్టుకున్నాయి. జూకు వెళ్లే సందర్శకులను నిత్యం హంసలు వాటి విన్యాసాలతో అలరిస్తున్నాయి.

'నెహ్రూ–ఇండియా'పై 10న సదస్సు

మద్దిలపాలెం: దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని బాల వికాస్ ఫౌండేషన్, గాంధీ సెంటర్ సంయుక్తంగా ఈ నెల 10న డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజీ ప్రాంగణంలోని గాంధీ సెంటర్ సెమినార్ హాల్‌లో 'నెహ్రూ–ఇండియా' అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సదస్సులో ఆచార్య వి.బాలమోహన్ దాస్, ఆచార్య పి.పద్దయ్య, సీనియర్ అడ్వకేట్ సియెన్, ఎస్.పి.కృష్ణారావు తదితరులు పాల్గొంటారని బాల వికాస్ ఫౌండేషన్ ప్రతినిధి ప్రకాశ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు.

జనావాసాల మధ్య వైన్ షాపులతో ఇబ్బందులు




హెచ్‌బీ కాలనీలో ఇళ్ల మధ్య ఏర్పాటు చేసిన మద్యం దుకాణం

మద్దిలపాలెం: కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త మద్యం పాలసీతో బడి, గుడి అనే తేడా లేకుండా ఎక్కడపడితే అక్కడ వైన్ షాపులు వెలుస్తున్నాయి. జనావాసాల మధ్య దుకాణాలు ఏర్పాటు చేయడంతో మందుబాబుల ఆగడాలకు రహదారులే అడ్డాగా మారుతున్నాయి. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రాంతానికో మద్యం దుకాణం ఉండేది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీ పుణ్యమా అని.. అడుగుకో వైన్ షాప్‌ను ప్రారంభించారు. మద్యం దుకాణాల ఏర్పాటుకు నియమ నిబంధనలు లేవా అని స్థానికులు మండిపడుతున్నారు. ఇష్టానుసారంగా అనుమతులివ్వడంతో శాంతిభద్రతలకు భంగం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

100 మీటర్ల దూరంలో రెండు దుకాణాలు

గతంలో హెచ్‌బీ కాలనీలోని బస్‌స్టాప్ వద్ద ఒక వైన్ షాప్ ఉండేది. ఇప్పుడు అదే ప్రాంతంలో 100 మీటర్ల దూరంలో రెండు మద్యం దుకాణాలు ఏర్పాటయ్యాయి. పాత వెంకోజీపాలెంలోని హెచ్‌బీ కాలనీ నుంచి డాక్టర్ వి.ఎస్.కృష్ణా కళాశాలకు వెళ్లే మార్గంలో ఇళ్ల మధ్యన నూతనంగా జ్యోతి వైన్స్ ఏర్పాటు చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెల్లారితే ఇదే ప్రాంతంలో చిన్నారులు, మహిళలు, కూలీలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. జనావాసాల మధ్య వైన్ షాపులు ఏర్పాటు చేస్తే ఎలాగని ప్రశ్నిస్తున్నారు. ఈ నూతన మద్యం దుకాణానికి రెండు మార్గాల అవతల ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కార్యాలయం ఉందని, కనీసం వారు దీని అనుమతిపై ఆలోచించకపోవడం దారుణమని వాపోతున్నారు. విచ్చలవిడిగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తే వీధుల్లో చిన్నారులు, మహిళలు స్వేచ్ఛగా తిరిగే అవకాశాన్ని కోల్పోతామని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఎక్సైజ్ శాఖ అధికారులు పునరాలోచించాలని వారు కోరుతున్నారు.

మూన్నాళ్ల ముచ్చట..



పెదవాల్తేరు కూడలిలో నిరుపయోగంగా వాటర్ ఫౌంటెయిన్

బీచ్‌రోడ్డు: నగరంలోని ప్రధాన కూడళ్ల సుందరీకరణలో భాగంగా ఆకర్షణీయ ఆకృతులు, వాటర్ ఫౌంటెయిన్ల ఏర్పాటు కార్యక్రమం జీవీఎంసీ చేపట్టింది. వాటి చుట్టూ విద్యుద్దీపాలు అమర్చి కాంతివంతంగా తీర్చిదిద్దింది. ఇందులో భాగంగా పెదవాల్తేరు మానసిక ఆస్పత్రి కూడలి వద్ద లక్షల రూపాయలు వెచ్చించి శ్రీకృష్ణుడి విగ్రహంతో కూడిన వాటర్ ఫౌంటెయిన్, చుట్టూ విద్యుత్ కాంతులు ఏర్పాటు చేశారు. దీనిని నాలుగు నెలల కిందట అట్టహాసంగా ప్రారంభించారు. తొలి రెండు రోజులు ఎంతో అందంగా కనిపించింది. ఆ కూడలి మీదుగా రాకపోకలు సాగించిన ప్రతి ఒక్కరినీ ఆకర్షించింది. జీవీఎంసీ సిబ్బంది నిర్వహణ లోపమో.. లేక నిర్మాణ లోపమో తెలియదు కానీ.. ఆ తరువాత నుంచి నేటి వరకు ఒక్కసారి కూడా వాటర్ ఫౌంటెయిన్ పనిచేసిన దాఖలాలు లేవు. దీంతో మూన్నాళ్ల ముచ్చటగానే కూడలి మళ్లీ బోసిపోయింది.